# స్వాతంత్ర్య సిద్ధి

కోమలవిలాస్ పన్నెండవ నెంబరు గదిలో దిగి రెండు రోజుల నుండీ భోజనవసతి సరిగా కుదరలేదని అవస్థ పడుతున్న దంపతులకు ఆ ఉదయము టీ త్రాగుతుండగా అకస్మాత్తుగా బాల్యస్నేహితురాలైన యశోధర జ్ఞాపకము వచ్చింది.

''యశోధర ఇక్కడే ఉన్నదటండీ. మా నాన్నగారు చాలసార్లు అన్నారు. ఆమె ఎడ్రసుకూడా నా డైరీలో ఉండే ఉంటుంది.'' అని మాలతి తలదువ్వుకుంటూ తటాలున లేచి నిలువబడ్డది

''యశోధరా? ఇక్కడేం చేస్తున్నది? అన్నట్లు ఆమె స్వాతంత్ర్యోపాసకురాలు కదూ! బాల్యములో ఎప్పుడూ వాదిస్తూఉండేది. చదువు పూర్తిచేసుకున్నదా?'' అన్నాడు మాధవరావు.

''పాపము! చదువు పూర్తిచేసుకోలేక పోయింది రెండేళ్ళ క్రిందట కెప్టెను పి. వి. రావును పెళ్లి చేసుకున్నది. ఢిల్లీలోనే ఉంటున్నారని మా నాన్నగారు వ్రాశారు'' అంటూ దువ్వెన శుభ్ర పరిచింది.

''మనము మొన్నటినుండీ అర్ధాకలితో అవస్థ పడుతున్నాము కదా-ఇవి వివరాలు తెలిసికూడా మాట్లాడకుండా ఊరుకున్నావేం? ఆడవాళ్ళకు సమయానికి ఏదీ జ్ఞాపకానికి రాదు'' అంటూ మాధవరావు లేచి కోటువేసుకొని తయారు అయినాడు.

''ఆడవాళ్లకే సమయానికి జ్ఞాపకంవస్తుంది. ఆమాట నాచేత ఎందుకు అనిపించుకుంటారు? మనము వెళ్ళితే యశోధర చాలా సంతోషిస్తుంది- పదండి'' గదికి తాళము వేసి ఇద్దరూ బయలుదేరినారు.

మాధవరావు మనసు త్రోవ పొడుగునా మధనపడ్డది. యశోధర చిన్నప్పుడు పెళ్లి చేసుకోనని అందరితో చెప్పుతూ ఉండేది. వివాహము తన స్వాతంత్ర్యానికి

భంగం కలిగిస్తుందని భయపడేది. పెళ్లి ఆమె ఇష్టముమీద జరిగిందోలేదో నని అనుమానించాడు.

"మీరు పొరపడుతున్నారు. పెద్దపిల్లలయిన తరువాత బలవంతముగా వివాహము ఎవరైనా చెయ్యగలుగుతారా? వరుడికి వయసు ఎక్కువని తలిదండ్రులు సందేహిస్తూఉంటే యశోధరే పట్టుపట్టింది. పెళ్లికాగానే అత్తవారింటికి వెళ్లింది. మళ్ళీ పుట్టింటికి యింతవరకూ వెళ్లలేదు" అన్నది మాలతి. ఆమెకు యశోధర అంటే ప్రాణము.

"మిమ్మలనందరినీ ఏడిపిస్తూ ఉండేది కదూ? మీరంతా మగవాళ్లకు బానిస లయిపోతున్నారనీ- అంతరాత్మను చంపుకున్నారనీ- అసహ్యించుకుంటూ ఉండేది కదూ? నాకు బాగా జ్ఞాపకము. ఆడవాళ్లు నగలను చూసుకొని మురుస్తారు గాని, అవి దాస్యశృంఖలాలని తెలుసుకోరు. నగలు బానిసచిహ్నామని తెలుసుకున్ననాడే స్త్రీకి స్వాతంత్ర్యము వచ్చినదనుకోండి అని అంటూ ఉండేదికదూ?" అన్నాడు మాధవరావు.

"ఒక విధముగా ఆమాట నిజమేనేమో! వాటిమీద తమకెక్కువ అధికారము లేకపోయినా స్త్రీలు నగలను చూసుకొనిమురుస్తూ జీవితాలను గడుపుతారు. అయినా యశోధర తెలివిగలది. ఆమె అన్యాయాలను ఏమాత్రము సహించే మనిషికాదు. ఒకసారి మా బావగారు మా అక్కయ్యను తీసుకొని వెళ్లాలని మా వాళ్ళింటికి వచ్చారు. తాను ఊళ్ళో ఉండకపోయినా మా అక్కయ్య వాళ్లయింట్లో ఉండాలంటాడు. దానిని తీసుకొని తనతల్లి దగ్గర విడిచిపెట్టి తాను ఎక్కడికో వెళ్లతానంటాడు. మా అమ్మా నాన్నగారూ వద్దంటారు. ఆయనకు తీసుకొని వెళ్ల వలెనన్న పట్టుదల. ఇలా అందరూ సంఘర్షణ పడుతూ ఉండగా యశోధర వచ్చింది. సంగతంతా విని 'మా అక్కయ్య బానిస కాదనీ- జడపదార్థముకాదనీ- జీవము గలదనీ- ఇచ్ఛగల జీవి అనీ- అంతరాత్మగల వ్యక్తిఅనీ' ఎన్నో విధాలుగా మా బావగారితో వాదించింది. అంతావిని మా అక్కయ్య రానన్నట్లయితే మా బావగారు వెళ్ళిపోతానన్నారు. అందరమూ అక్కయ్య ఏమంటుందో ననుకున్నాము. అది ప్రయాణానికి సిద్ధమై చెప్పులుకూడా వేసుకొని గడపదగ్గర నిలువబడ్డది. దానితో మా అక్కయ్యఅంటే యశోధరకు అసహ్యమువేసింది. అవివేకి అని మా అక్కయ్యను అందరిముందర అంటూ ఉండేది యశోధర. ఎట్లాగయినా మగవాళ్లు

అధికారం చలాయిస్తారని మా యశోధర అభిప్రాయము ఏమంటారు?'' అన్నది మాలతి. నడుస్తూ నడుస్తూ ఇంత దీర్ఘ సంభాషణ చేసేసరికి మాలతికి ఆయాసము, ఒగర్పు వచ్చినవి.

''కాదని నోటితో చెప్పితే అట్టే బాగుండదులే.... కాని.... చూశావా! నీ కెంత ఆయాసము వచ్చిందో? ఇంకా అయిదు నిమిషా లయినా నడిస్తేగాని మనకు బస్సు దొరకదు. పది బారలయినా సునాయాసంగా నడవలేదుగాని పెద్దపెద్ద కబుర్లు చేప్తారు. ఈ కుసుమకోమల శరీరాలను జాగ్రత్తగా కాపాడే బాధ్యత మాత్రము మాది అవునా? త్వరగా నడుమరి. ఆ బస్సు కాస్తా వెళ్లిపోతుంది''- అనుకుంటూ ఇద్దరూ బయలుదేరి రెండు బస్సులు మారి, అతి ప్రయాసతో యశోధర ఎడ్రసు కాగితము పట్టుకొని అడుగుతూ వెళ్లారు.

ఉదయము పదకొండు గంటలయినది. నానా అవస్థలూపడి మాలతీ మాధవ రావులు ఎట్లాగో యశోధర యింటిని తెలుసుకొని వెళ్లగలిగినారు.

యశోధర బాల్యస్నేహితులను చాలా ఆదరించింది. డ్రాయింగు రూములో కూర్చుండబెట్టి టీ యిచ్చింది. అందరూ సంభాషణలో పడ్డారు. అనేక విషయాలు-తాము వెనుక కలసికొన్నప్పటినుండీ నేటి వరకూ-యశోధర పెండ్లీ-ఆయన ఉద్యోగమూ-సంసారము అనేక ముఖాలుగా సంభాషణ నడచిపోయింది.

యశోధర వాళ్లిద్దరినీ టీ తీసుకొమ్మని బలవంతంచేసింది.

''నీవు కూడా తీసుకో, మమ్మల నిద్దరిని మాత్రమే తీసుకొమ్మంటే మేము తీసుకోము'' అన్నది మాలతి

''ఇదేమిటి మీరుకూడా తీసుకోవాలి'' అన్నది మాలతి.

''నేను కాఫీ, టీ త్రాగటము యిక్కడికి వచ్చిన తరుదాత మానివేశాను. పాలు అలవాటు చేసుకున్నాను. నా మాటకేంగాని మీరిద్దరూ తీసుకోండి'' యశోధర వాళ్లను బలవంతం చేసింది.

''కాఫీకూడా మాన్పించగలిగాడూ!'' అని మాధవరావు ఆశ్చర్యమునకు లోనైనాడు. యశోధర రుచులమీదకూడా అధికారము వహించిన ఆ వ్యక్తిని చూడ వలెనన్న కుతూహలను మాధవరావుకు ఇనుమడించ నారంభించింది.

యశోధర మాటలను ఆలకిస్తున్న మాలతి- వెనుకటి యశోధర ఛాయలు ఏమైనా ఇప్పటి యశోధరలో కనబడుతాయేమోనని వెదకసాగినది.

ఇప్పటి యశోధరలో. ఇంకా ఏఏ విషయాలలో వెనుకటి ఛాయలు ఉన్నాయోనని మాధవరావు పరిశోధనకు పూనుకున్నాడు.

అంతలో యశోధర తన యింటిని యావత్తూ వాళ్లిద్దరికీ చూపించింది. అప్పటికి పన్నెండు గంటలు దాటి పోయినవి. యశోధర తన స్నేహితులకు తగిన ఏర్పాట్లుచేసి భోజనానికి లేవమన్నది.

"నీవుకూడా మాతో భోజనము చేయవా?" అన్నది మాలతి.

"మీరు మాతో కలిసి భోజనము చేయకపోతే-మేము భోజనము చేయము" అన్నాడు మాధవరావు.

"మీరిద్దరూ మాకు అతిథులు, మీరు అట్లా పట్టు పట్టకూడదు. మీరిద్దరూ భోజనము చేయండి. ఆయన వచ్చేవరకూ నేను ఉంటాను. ఆయన ఒంటిగంటకు వస్తారు. ఒక్కరూ భోజనము చెయ్యలేరు. తోడుగా ఒకమనిషి ఉంటే కాస్త నయము. పాపము పనిచేసి చేసి వస్తారా- భోజనము సరిగా చేయకపోతే ఆరోగ్యము చెడిపోతుంది. అందుకని మీరిద్దరూ ముందు భోజనము చెయ్యండి" అని వాళ్లను ఒప్పించి భోజనము పెట్టించింది.

మాలతీ మాధవరావులు చెరి ఒక విధముగానూ ఆశ్చర్య పడిపోతున్నారు. మాధవరావు మరీను- మాలతివంక చూసి అప్పుడప్పుడు నవ్వటము మొదలు పెట్టాడు. ఆ నవ్వులో మాలతి పరాజయమే ప్రతిధ్వనించసాగింది.

భోజనాలయిన తరువాత యశోధర తమలపాకుల పళ్లెము తెచ్చి మాలతి చేతికి ఇస్తూండగా- మాలతి దృష్టి యశోధర చేతిపైన పడ్డది.

"ఇదేమిటే ఇటువంటి ఉంగరము పెట్టుకున్నావు? అంత మోటుగా చేయించుకున్నావేం?" అన్నది మాలతి వెంటనే.

"ఇదా? ఈ ఉంగరమూ - ఈ గాజులూ ఆయన సెలక్షను. అందుకని అవంటే నా కెంతో ఇష్టము. ఒక్కరోజయినా తియ్యను. తీస్తే ఆయన మనసు ఎక్కడ నొచ్చుకుంటారో నని నా భయము. నీకేమి నచ్చలేదా ఈ ఉంగరము?

మీరిద్దరూ ఆయనను చూడలేదుకాబోలు. అయిదు నిమిషాలలో వస్తారు సామాన్య ముగా నేను ఆయన వచ్చేలోపల పనులన్నీ ముగించుకొని తీరికగా ఉంటాను. లేక పోతే మరచిపోతూ ఉంటాను"- ఈ ధోరణిలో యశోధర మాట్లాడుతూ ఉంటే 'ఆయన' అన్న ముక్కను మాలతి సహస్రముగా ఎంచింది.

యశోధర మాటలన్నీ విని "ఆయనవస్తే- మీరు మమ్మల్ని మరచి పోతా రేమో! ఎట్లా? మేము వెళ్ళమా మరి?" అన్నాడు మాధవరావు.

"చాచా! మిమ్మల్నిద్దరినీ మరచిపోవటమేమిటి? మీ రిద్దరూ నన్ను హాస్యముచేయటానికని రాలేదు కద!" అన్నది యశోధర.

అంతలో 'జేసూ! అంటూ నీలమేఘ శ్యాముడైన ఆజానుబాహువు మిలి టరీ దుస్తులతో లోపలికి వస్తున్నాడు.

యశోధర చివాలునలేచి ఎదురు వెళ్ళింది. ఆమె వదనము చంద్రదర్శనమైన కలువవలె మాధవరావుకు కనబడ్డది. వెంటనే మాధవరావు కూర్చున్నచోట నుండి లేచి 'యశోధరకు సిద్ధించిన స్వాతంత్ర్యాన్ని కన్నుల పండువుగా చూచావా?' అని చెవిలో ఊదాడు

మాలతీ మాధవరావులు ఉన్నచోటికి తిరిగి యశోధర వచ్చేసరికి ఆయిదు గంటలు కొట్టారు.